సాక్షి తిరుపతి

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్ సాయి తెలిపారు.

- 8లో



అవ్వాతాతలకు చంద్ర 'గ్రహణం'

అవ్వాతాతలకు చంద్ర 'గ్రహణం'పట్టిందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు.

- 8లో



న్యూస్‌రీల్

ఎప్పటికప్పుడు ఎన్నికల ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: ఎప్పటికప్పుడే ఎన్నికల ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ ఓటింగ్‌తో పాటు హోమ్ ఓటింగ్ కార్యక్రమాలు చేపట్టడానికి అధికారులు చేయాల్సిన బాధ్యతలను తెలియజేశారు. డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వోలు అదిత్‌సింగ్, నిషాంత్‌రెడ్డి, చంద్రముని, నరసింహాలు, ఎన్నికల నోడల్ అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పవన్ పాల్గొన్నారు.

నిర్మాణంలోని ఇళ్లు కొనసాగింపు



కాయంలోని లేఅవుట్

తిరుపతి అర్బన్: నిర్మాణ దశలోని ఇండ్లు యథావిధిగా కొనసాగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 575 లేఅవుట్లలో 77,606 ఇండ్లు మంజూరు చేయగా.. ఇప్పటికే 29,019 ఇళ్లు పూర్తి చేసింది. మరో 29,019 ఇండ్లు పునాదుల దశలో కొనసాగుతున్నాయి. మిగిలిన ఇండ్లు స్లాబ్, గోడలు, వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి. పూర్తి చేసిన ఇండ్లుకు దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న మెటీరియల్‌ను యథావిధిగా అందిస్తున్నారు. మొత్తంగా పేదలకు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే ప్రారంభమైన ఇళ్లను కొనసాగించనున్నారు. కోడ్ అనంతరం కొత్త ఇళ్లకు అవకాశం ఉంటుందని సమాచారం.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి పింఛన్ల పంపిణీ, వడగాల్పులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు, తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్. జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి ఆయా సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ చేయాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఎల్‌డీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి పాల్గొన్నారు.

రుగ్వేద పారాయణం ప్రారంభం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో సోమవారం రుగ్వేద పారాయణం ప్రారంభమైంది. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 12 మంది నిష్ణాతులైన వేద పండితులు పాల్గొని పారాయణం చేశారు. లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ 2020, ఏప్రిల్ 11వ తేదీ నుంచి టీటీడీ చతుర్వేద పారాయణం ప్రారంభించింది. మొత్తం నాలుగు వేదాల్లోని ఐదు శాఖలు మూలం పారాయణం చేశారు. ఇప్పటి వరకు మూడు సార్లు చతుర్వేద పారాయణం పూర్తిచేసి, మరలా 4వ సారి ఏప్రిల్ 1వ తేదీ నుంచి రుగ్వేద పారాయణం ప్రారంభించారు. రోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఈ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తారు. చతుర్వేద పారాయణం వలన అనంతమైన ఫలితం సిద్ధిస్తుందని ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ తెలిపారు.

అందుబాటులో ఎరువులు



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కుమార్

తిరుపతి అర్బన్: రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ తాయారమ్మ మార్చి 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌కు పవన్‌కుమార్‌కు తిరుపతి జిల్లా ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను ఆర్బీకేల ద్వారా అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

పండుటాకులపై పగా?



'మేం ఏం పాపం చేశాము. మాపైన వాళ్లకు ఎందుకంత పగ. వలంటీర్లపై కక్షగట్టి మా నుంచి దూరం చేశారు. ఒకటో తేదీ తెల్లవారేసరికి ఇంటికొచ్చే పెన్షన్‌ని రానీయకుండా చేశారు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. మళ్లీ మేము క్యూల్లో నిలబడాలా..?. మండు టెండల్లో సొమ్మసిల్లి పడిపోవాలా..?. పనులు మానుకుని.. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరీక్షించాలా..?' అంటూ పెన్షన్ దారులు విరుచుకుపడుతున్నారు. చంద్రబాబునాయుడు అండ్ కో.. వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎన్నికల కమిషన్ వారిని సంక్షేమ పథకాల నుంచి మినహాయించింది. లబ్ధిదారులకు ఒకటో తేదీ అందాల్సిన పెన్షన్ అందకుండా పోయింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు రాక్షసానందం పొందుతున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు.

లేవలేని స్థితిలో ఉన్నా



నాకు రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి కదల్లేక మంచానికే పరిమితమైనాను. నెలనెలా వచ్చే పింఛనుపైనే మందులుమాకులు ఇతరులతో చెప్పి తెప్పించుకునేవాడిని. ప్రతినెలా ఒకటో తారీఖున వలంటీర్ నిద్రలేపి నా వేలిముద్ర తీసుకుని ఇంటివద్దనే పింఛన్ ఇచ్చేవాడు. ఈ రోజు(సోమవారం) పింఛన్ ఇవ్వలేదు. సచివాలయానికి వెళ్లి తెచ్చుకోమంటున్నారు. నేను అంత దూరం వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకునేది..?. ఏ పుణ్యాత్ముడో ఫిర్యాదు చేసి నాలాంటి వారి ఉసురు పోసుకున్నాడు. పింఛన్ ఇంటికి రాకుండా చేశారు. నేను సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే నలుగురిని మంచంపై సచివాలయం వద్దకు మోసుకెళ్లాలి. అదే వలంటీర్ అయితే ఇంటివద్దకే వచ్చి ఇచ్చిపోయుండేవాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ దిగులూ లేకుండా ఉండేది. ఇప్పుడు ఇంటికాడికి తెచ్చి ఇవ్వకపోయినా ఆయన చేసిన మేలు మరిచిపోతామా?.

– గోవిందనాయుడు, కుప్పంబాదూరు గ్రామం, రామచంద్రాపురం

గుడ్డివారి గోస టీడీపీకి తగులుతుంది



నాకు కంటి చూపులేదు. ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టాలంటే మనిషి తోడుకావాలి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యాన ఇంటి వద్దనే ప్రతినెలా ఒకటవ తేదీ గ్రామ వలంటీర్ ద్వారా పింఛన్ అందుకునేదాన్ని. తెలుగుదేశం పార్టీ పుణ్యమా అని ఈ నెల నుంచి ఎన్నికల సాకు చూపి వలంటీర్లను ప్రభుత్వ సేవల నుంచి పక్కన పెట్టడం దురదృష్టకరం. నా లాంటి కంటిచూపు లేని వాళ్లు ఎక్కడో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి క్యూలో నిలబడి పింఛన్ ఎలా తీసుకోవాలి..?. మాలాంటి వారి గోడు తప్పక తెలుగుదేశం పార్టీకి తగులుతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి కష్టాలు ఎన్నో పడ్డాము. గత 58 నెలలు ఆ బాధల నుంచి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని విముక్తి లభించింది. మళ్లీ వలంటీర్ల ద్వారానే పింఛన్ సొమ్ము ఇంటి వద్దకు వచ్చి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–నాగమ్మ, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం మండలం

బాబు కుట్రలకు బలైపోయాం



టీడీపీ హయాంలో పింఛన్ వచ్చే వరకు ప్రతిరోజూ అవస్థలే. ఎప్పుడు..? ఎక్కడిస్తారో తెలియని పరిస్థితి. పంచాయతీ, పోస్టల్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ కష్టాల నుంచి వృద్ధులను, వితంతువులను గట్టెక్కించారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామ వలంటీర్ ద్వారా ప్రతినెలా ఒకటో తేదీనే మా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. అనారోగ్య కారణంతో మంచానికే పరిమితమైన నాలాంటి వారికి ఈ పద్ధతి ఎంతో ఊరటనిచ్చింది. ఇప్పుడు మళ్లీ సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకునే పరిస్థితులు ఏర్పడడం ఆందోళన కలిగిస్తోంది. నేను సచివాలయానికి వెళ్లాలంటే అద్దె ఆటో కావాలి. దానికి తోడు నా వెంట మరో వ్యక్తి సహాయం అవసరం. ఇంట్లో వారు సైతం పనులు మానుకుని నా వెంట రావాల్సిన పరిస్థితి. వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసే దాంట్లోనూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదు. నాలాంటి వృద్ధులు, వితంతువులు, ప్రత్యేక ప్రతిభావంతులు టీడీపీ నేతల కుట్రలు, కుతంత్రాలకు ఓటుతో బుద్ధి చెబుతాం.

–మాచాలమ్మ, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం మండలం

టీడీపీ పాలనలో అష్టకష్టాలు..మళ్లీనా?



వాకాడు మండలం, ఇన్నమాల గ్రామానికి చెందిన పోలయ్య వయసు 91, చేను చెంగమ్మ వయసు 85, ఇన్నమాల సుబ్బమ్మ వయసు 86, బండి వెంకటసుబ్బయ్య వయసు 78. వీరి వలంటీర్లు ఉమ్మడి మోహన్, పీ.సులోచన, అఖిల కవిత. సోమవారం ఒకటో తేదీ కావడంతో వారి రాకకోసం ఎదురు చూశారు. కొత్త వ్యక్తులు ఎవరు కనిపించినా నాయనా.. మీరు మాకు పింఛన్ ఇచ్చే వారా?.. అయితే నా పేరు ఫలానా.. నాకు పింఛన్ ఇవ్వండి' అని అడిగి మరీ నిరాశ చెందారు. తెల్లవారు జాము నుంచి అవ్వాతాతలు వీధి కాలవలపై కూర్చుని పింఛన్ కోసం ఎదురు చూసి నిట్టూర్పుతో వెనుదిరిగారు. చంద్రబాబు పుణ్యమా అంటూ మరో మూడు నెలలు పింఛన్ ఇంటికి రాదని సమాచారం తెలుసుకున్న అవ్వాతాతలు మాకు పింఛన్ రాకుండా చేసిన చంద్రబాబు, వారి మనుషులు మట్టి కొట్టుకుపోతారని శాపనార్థాలు పెట్టారు.

వాకాడు మండలం, గొల్లపాళెం గ్రామ వీధిలో కూర్చుని ఎదురు చూస్తున్న అవ్వాతాతలు

మేమంటే బాబుకు ఎందుకంత కక్ష



గతంలో వెయ్యి రూపాయల పింఛన్ కోసం మండుటెండల్లో కిలోమీటరు పొడవున ఉండే క్యూలో నిలబడేదాన్ని. నా మనవడు జగన్ వచ్చాక ఆ పరిస్థితి లేదు. నాకు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామున్నే మా వలంటీర్ సులోచన ఇంటికొచ్చి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేది. ఈనెల ఒకటోతేదీ వచ్చినా మా వలంటీర్ ఇంటికి రాలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గడపలో కూర్చుని ఎదురు చూశాను. ఎందుకు రాలేదని వేరే వాళ్లను అడిగితే చంద్రబాబు, వాళ్ల మనుషులు వలంటీర్లుపై కోర్టుకు వెళ్లి కేసు వేశారని చెప్పారు. మరో మూడు నెలలు ఆఫీసుకాడికి వెళ్లి పింఛన్ తీసుకోవాలన్నారు. చంద్రబాబుకు పోయే కాలం దగ్గరపడి పేదలను ఇలా కష్టాలు పెడుతున్నాడు. చంద్రబాబు అప్పుడు అలా చేశాడు.. ఇప్పుడు ఇలా అడ్డుకుంటున్నాడు. ఆయన పాలనలో ఆఫీసుల చుట్టూ తిప్పించుకుని నాలుగో రోజున పింఛన్ ఇచ్చే వారు. ఇప్పుడు నా మనవడు జగన్ దయతో ఐదేళ్లు ఆ కష్టాలు తప్పినాయి. మళ్లీ చంద్రబాబు పాత రోజులను తీసుకురావడం దుర్మార్గం.

చేను చెంగమ్మ వృద్ధురాలు, గొల్లపాళెం, వాకాడు మండలం

మా ఉసురు తగలకుండా పోదు



జగనన్న ప్రభుత్వ హయంలో మాకు తెల్లారేసరికి నిద్రలేపి పింఛన్ ఇచ్చారు. వలంటీర్ల ద్వారా ప్రతినెలా 1వ తేదీనే ఇంటికొచ్చి పింఛను ఇచ్చి, సమస్యలు అడిగి తెలుసుకునేవారు. జీతం తరహాలో పింఛను తీసుకుంటున్నాం. కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు మాకు అండగా నిలిచారు. వలంటీర్ల సేవలు మాకు ఎంతో బలాన్ని ఇచ్చాయి. ఇప్పుడేమో ఎన్నికలు అని చెప్పి మాకు పింఛన్ అందకుండా చేశారు. పింఛన్ అడ్డుకున్న వాళ్లకు మాలాంటి ముసలోళ్ల ఉసురు తప్పకుండా తగులుతుంది. ప్రభుత్వం వలంటీర్ల ద్వారా మాకు మంచి చేస్తుంటే ఓర్వలేక అడ్డుపడడం బాధగా ఉంది. ఎవరో వద్దన్నారని వలంటీర్లు ఏమో ఈరోజు పింఛను ఇవ్వలేదు. ఎందుకని అడిగితే టీడీపీ వాళ్లు వలంటీర్ల ద్వారా పింఛను ఇవ్వొద్దని అడ్డుకున్నారని తెలిసింది. ఇది మంచి పద్ధతేనా..?. మాలాంటి ముసలోళ్లకి మంచి జరిగితే ఓర్వలేరా..?. మాలాంటి వాళ్లపైన కక్షగట్టి పింఛన్ రాకుండా చేశారు. మా ఉసురు తలగకుండా పోదు.

– నరసమ్మ, ఎర్రమిట్ట, తిరుపతి

మళ్లీ పాతరోజులా?



గత ఐదేళ్లుగా ప్రతినెలా ఒకటో తారీఖునే మాకు పింఛను వచ్చేది. వలంటీర్లు గౌరవంగా మా ఇంటికొచ్చి తలుపు తట్టి ఉదయానికల్లా పింఛన్ ఇచ్చేవాళ్లు. ఏదో... ఎన్నికల కోడ్ పేరుతో మాకు పింఛన్ రాకుండా అడ్డుకున్నారు. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. పింఛన్ కోసం మళ్లీ పాత రోజులను తీసుకొస్తున్నారు. గంటల తరబడి ఎదురు చూసి పింఛన్ తీసుకునే పరిస్థితులు మళ్లీ కల్పిస్తున్నారా?. గతంలో చెప్పినచోటుకు వెళ్లి పింఛను తీసుకునే వాళ్లం. ఆ రోజు పనులు వదులుకొని ఆటో ఖర్చు భరించి పింఛన్ తీసుకునేవాళ్లం. ఆ చీకటి రోజులను మళ్లీ తీసుకొస్తున్నట్లు కనిపిస్తోంది. వలంటీర్ల ద్వారా పింఛను తీసుకుంటే ఎవరికి ఇబ్బందో అర్థం కావడం లేదు. ఏదైనా ఉంటే రాజకీయాలు నేరుగా చేసుకోండి. మాలాంటి వాళ్లపై పడొద్దు. ఇది మంచి పద్ధతి కాదు.

– భీమారెడ్డి, శివ జ్యోతి నగర్, తిరుపతి

మా కడుపు కొట్టొద్దు



ఒకటో తేదీ కల్లా మాకు పింఛన్ ఇంటికొచ్చి ఇస్తారు. అయితే మాకు పింఛన్ రాకుండా టీడీపీ వాళ్లు అడ్డుకున్నారని తెలిసింది. మాలాంటి వాళ్ల కడుపుకొట్టే పనులు చేయడం మంచిది కాదు. ఎన్నో ఇబ్బందులతో పింఛన్ వస్తుందని ఎదురుచూస్తూ ఉంటాం. నిత్యావసర సరుకులు, కూరగాయల దుకాణాల్లో అప్పులు కూడా పెట్టుకుంటాం. అప్పు ఇచ్చిన వాళ్లు కూడా ఒకటో తేదీ కల్లా తిరిగి చెల్లిస్తారనే నమ్మకంతో ఉంటారు. అలాంటిది ఈ నెల పింఛన్ రాకుండా చేశారు. మూడో తేదీ సచివాలయానికి వెళ్లి తీసుకోవాలంట. పనులు వదులుకుని, ఎవరో ఒకరిని తోడు పెట్టుకుని సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోవడం అంటే మమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టే కదా..? ఆ రోజంతా మాకు వృథానే అవుతుంది. మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని ఆలోచించిన దుర్మార్గులకు తగిన బుద్ధి చెబుతాం.

– మునిరత్నం, జీవకోన, తిరుపతి

మేమంతా సిద్ధం

- నేడు చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించనున్న బస్సు యాత్ర
- సదుం మండలం, అమ్మగారి పల్లెలో బస చేయనున్న సీఎం
- మరుసటి రోజు ఉదయం నుంచి సాగనున్న బస్సు యాత్ర
- 3న పూతలపట్టు, 4న నాయుడు పేటలో మేమంతా సిద్ధం సభలు
- మూడు రోజుల పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పర్యటన
- ఏర్పాట్లలో నిమగ్నమైన నేతలు





సదుం: సీఎం బస కోసం ఏర్పాట్లు

సాక్షి, తిరుపతి: ప్రజాసంకల్ప పాదయాత్ర తరహాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు చిత్తూరు, తిరుపతి జిల్లా వాసులు 'మేమంతా సిద్ధం' అంటున్నారు. సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టేందుకు ఊరూవాడా సిద్ధమయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల సమరభేరి మోగించి ప్రచారానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన ఈ బస్సు యాత్ర వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ముగించుకుని మంగళవారం చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. నేటి నుంచి మూడు రోజుల పాటు బస్సు యాత్ర పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల మీదుగా సాగనుంది. మొదటి రోజు సాయంత్రం బోయకొండ క్రాస్ నుంచి ప్రారంభం కానున్న ఈ బస్సు యాత్ర చౌడేపల్లి, సోమల మండలాల మీదుగా.. సదుం మండలం అమ్మగారిపల్లె వరకు సాగుతుంది. తర్వాత ముఖ్యమంత్రి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు (బుధవారం) సదుం మండలం నుంచి బస్సు యాత్ర ప్రారంభించనున్నారు. అదే రోజు రాత్రి తిరుపతి జిల్లాలో ముగియనుంది. గురువారం ఉదయం తిరిగి తిరుపతి జిల్లాలో బస్సు యాత్ర ప్రారంభమవుతుంది.

సమరోత్సాహం

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం నెలకొంది. చంద్రబాబు సొంత జిల్లానే అయినా.. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ రాజశేఖరరెడ్డికి కంచుకోటగా మారింది. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా 2019 ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టింది. 14 అసెంబ్లీ సీట్లలో 13 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మూడు పార్లమెంటు స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుని సైకిల్'ను పత్తా లేకుండా తరిమేసింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగనుంది. కుప్పంలో కూడా ఈ సారి సైకిల్ గాలి తీసేయడానికి ఓటర్లు 'మేమంతా సిద్ధం' అంటున్నారు. ఈ మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ముఖ్యమంత్రి బసకు సన్నాహాలు

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రాత్రి మండలంలోని అమ్మగారిపల్లె సమీపంలో బస చేయనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించి, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 14 ఆఖరు

తిరుపతి అర్బన్: కొత్త ఓటు నమోదుకు తుదిగడువు ముగియనుంది. 18 ఏళ్ల నిండిన వారు ఈ నెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సూచించారు. మార్చి 16వ తేదీ వరకు జిల్లాలో 17.94 లక్షల మంది ఓటర్లు ఉండగా.. అందులో కొత్తగా ఓట్లు పొందిన యువకులు 30,508 మంది ఉన్నట్టు వెల్లడించారు. ఏప్రిల్ 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చంద్రగిరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్‌సాయి తెలిపారు. కంపెనీలను నెలకొల్పే సమయంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. సోమవారం ఎంబీయూలో 'నావిగేటింగ్ ది ఫ్యూచర్ ట్రెండ్స్, స్ట్రాటజీస్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ మెనేజ్‌మెంట్' అనే అంశంపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్‌సాయి ఎంబీయూ వర్సిటీ రిజిస్ట్రార్ సారథితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్‌కు అనుగుణంగా నైతిక ప్రమాణాలను నిలబెట్టుకోవాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొఫసర్ భాను శ్రీరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక విజయాలను పొందడానికి వాటిపై నిరంతరం అధ్యయనం చేయాలని చెప్పారు. అనంతరం అతిథులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అవ్వాతాతలకు చంద్ర 'గ్రహణం'


పెన్షన్ రాక ఆవేదనతో ఉన్న లబ్ధిదారురాలిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


ఎన్నికల ప్రచారంలో రెపరెపలాడుతున్న వైఎస్సార్‌సీపీ జెండా

- పెన్షన్లు ఇవ్వనీయకుండా చేసిన చంద్రబాబు, పవన్
- ప్రజాసేవలకులైన వలంటీర్లపై కక్ష సాధింపు
- వారు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- జగనన్నను నేరుగా ఎదుర్కోలేక చంద్రబాబు కుటిల యత్నం
- ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం

తిరుపతి మంగళం : అవ్వాతాతలకు చంద్ర 'గ్రహణం'పట్టింది. గత ఐదేళ్లుగా 1వ తేదీ పెన్షన్ వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న అవ్వాతాతలపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కక్షగట్టి పెన్షన్ రాకుండా అడ్డుకున్న నీచులు' అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం తిరుపతిలోని 19, 20 డివిజన్లలో కార్పొరేటర్లు ఆరణి సంధ్య, రాజమ్మ, వెంకటమునిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పాటు మేయర్ డాక్టర్ శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్‌పల్లి పరిధిలో ఏగడపకు వెళ్లినా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. రాష్ట్రంలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో గత నాలుగన్నరేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వారి రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ముంగిటకే చేర్చాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా సంక్షేమ పథకాలన్నీ నేరుగా వారి ఇంటికే వెళ్లి అందిస్తున్నారని చెప్పారు. అవ్వాతాతలు, దివ్యాంగులు గంటల కొద్దీ మండుటెండల్లో నిలబడి పెన్షన్ తీసుకునే దుస్థితి లేకుండా 1వ తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు లబ్దిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించేవారని గుర్తుచేశారు. అయితే వలంటీర్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాన్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి అవ్వాతాతలు, దివ్యాంగులకు వలంటీర్లు పెన్షన్ ఇవ్వకూడదని ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సూచనలు, సలహాలతో చంద్రబాబు, పవన్ కళ్యాన్ ఫిర్యాదు చేసి లబ్దిదారుల పొట్ట కొట్టారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌కళ్యాన్‌ల కుటిల, నీచరాజకీయాలకు ఇది నిదర్శనమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్నిసార్లు మోసగించినా ప్రజలు సహించారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తన కుమారుడు, డెప్యూటీ మేయర్, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దుద్దేలబాబు, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, కంకనాల రమేష్, బాబుయాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు నల్లాని బాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనారు మధుబాల, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పడమటి కుమార్, ముబ్బు నాదమునిరెడ్డి, కోబాకు ధనంజయరెడ్డి, సద్దా బాబు, కిషోర్, మురళి, నారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, మల్లం రవి, సోమశేఖర్‌రెడ్డి, మునిసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, గీతా యాదవ్, శారద, ప్రమీల పాల్గొన్నారు.

వ్యవసాయానికి తలకోన జలపాతం నీరు


తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించిన తలకోన సాధన సమితి నాయకులు

- రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్య పరిష్కరిస్తా
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తలకోన జలాశయ నీటిని ఒడిసిపట్టి వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తలకోన నీటి సాధన సమితి నాయకులు సోమవారం తుమ్మలగుంట నివాసం వద్ద చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు చెరువుల ఆధునీకరణ, కట్టల బలోపేతం, సప్లై చానళ్ల పునఃనిర్మాణం వంటి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. కమ్మలచెరువు, అయ్యప్పచెరువు, నల్లసముద్రం, మదిచెరువు, వలసలపల్లి చెరువు, సిద్ధలగండి ప్రధానమైన చెరువులుగా చెప్పుకొచ్చారు. మొత్తం 764 చెరువులకు తలకోన జలపాతం నీటితో నింపే ప్రతిపాదనలు కూడా ఉన్నాయన్నారు. రానున్న జగనన్న ప్రభుత్వంలో తప్పక ప్రతిపాదనలు ఆచరణలో పెట్టే దిశగా కృషి చేస్తామన్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసిన వారిలో తలకోన సాధన సమితి అధ్యక్షులు మార్రెళ్ల శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజయ్య, రెడ్డెప్ప ఉన్నారు.

బడుగులేం చేశారు బాబు?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: 'బడుగు, బలహీన వర్గాల పేదలు, వితంతు అక్కచెల్లెమ్మలు ఒకటోతేదీ ఉదయం కల్లా పింఛన్ తీసుకునేవాళ్లు. కానీ చంద్రబాబునాయుడు వాళ్లపై పగబట్టి కక్ష తీర్చుకున్నారు. వలంటీర్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలని తను నమ్మిన బంటు నిమ్మగడ్డతో కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి తప్పించారు. ఇప్పుడు పండుటాకుల అవస్థలు వారు తీర్చగలరా..?' అంటూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం వలంటీర్లను తప్పించారని చెప్పారు. చంద్రబాబు, మిత్రపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ యువ నాయకులు ధార రవి, పాలేటి నాగార్జున, షేక్ రఫీ, కాళహస్తి భవాన్ పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

తడ: చేపల చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన గ్రద్దగుంటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ నరశింహారావు కథనం.. గ్రద్దగుంట ఎస్సీ కాలనీకి చెందిన కుప్పంపాటి వెంకయ్య(25) రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన చెరువులో సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. వెంకయ్య ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజులు కావడంతో మృత దేహం నీటిపై తేలుతూ అటుగా వెళ్లిన పశువుల కాపర్ల కంట పడడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఆపై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,224 మంది స్వామివారిని దర్శించుకోగా 24,093 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పోస్టల్ బ్యాలెట్‌కు 22న ఆఖరు

తిరుపతి అర్బన్: అత్యవసరశాఖలకు సంబంధించి డ్యూటీలో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఏలా వినియోగించుకోవాలనే అంశాలపై ఆయన కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. 33 విభాగాలను అత్యవసర విభాగాలుగా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రధానంగా ఆయా విభాగాలకు చెందిన జిల్లా అధికారులు వారి విభాగాల్లోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వాడకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం ఈ నెల 22వ తేదీలోపు 12డీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయకుంటే ఆ ఉద్యోగి మే 13వ తేదీ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటువేయడానికి వీల్లేదన్నారు.

యూజీసీ నాక్ టీమ్ సభ్యురాలిగా నారాయణమ్మ



తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ నారాయణమ్మను యూజీసీ నాక్ పీర్ టీమ్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీలు, కళాశాలల ప్రామాణికతను నిర్ణయించే నాక్ పీర్ టీమ్ కమిటీ సభ్యులుగా అరుదైన గౌరవం లభించడం సంతోషంగా ఉందన్నారు. టీటీడీ ఈఓ, జేఈఓ, డీఈఓలకు ఆమె ధన్యవాధాలు తెలిపారు. అనంతరం కళాశాల అధ్యాపకులు హేమలత, జయశ్రీ, విద్యులత, పద్మజ, వసుధ, బోధన, బోధనేతర సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు.

పూరిల్లు దగ్ధం


పునబాక గిరిజన కాలనీలో కాలిపోతున్న పూరిల్లు

పెళ్లకూరు: మండలంలోని పునబాక తూర్పుకండ్రిగ గిరిజన కాలనీకి చెందిన డేగా కవిత పూరిల్లు సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. గిరిజన కాలనీకి చెందిన కవిత ఆరుబయట పనులు చేసుకుంటుండగా గృహ విద్యుత్ తీగలు కాలి పూరింటి మీద పడ్డాయి. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో గ్యాస్ సిలిండర్, వస్తు సామగ్రి మంటల్లో కాలిపోయాయి. ఎస్‌ఐ శ్రీకాంత్, నాయుడుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితురాలు వాపోయింది.

యువతి ఆత్మహత్య

చిల్లకూరు: మనస్తాపం చెందిన ఓ యువతి ఆదివారం రాత్రి ఇంట్లో విషపు గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మోమిడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన మానికల చెంచులక్ష్మి(19) అనే యువతి సమీప బంధువును ప్రేమించి పెళ్లి చేసుకోవాలనేకునే సమయంలో కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన చెంచులక్ష్మి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో విషపు గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కిందపడి ఉపాధ్యాయుడి మృతి


కృష్ణప్రసాద్ (మృతుడు)

గూడూరు రూరల్: తొందరగా పాఠశాలకు చేరుకోవాలనే ఆత్రుతలో రైలు స్టేషన్‌లో ఆగకముందే ప్లాట్‌ఫారంపై దిగేందుకు ప్రయత్నించడంతో ఓ ఉపాధ్యాయుడు అదే రైలు కింద పడి మృతిచెందిన సంఘటన సోమవారం గూడూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. గూడూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్(42) నెల్లూరులో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం గూడూరు మండంలోని వెందోడు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దీంతో నిత్యం నెల్లూరు నుంచి గూడూరుకు రైలులో వచ్చి అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై వెందోడు పాఠశాలకు వెళుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నెల్లూరు– చెన్నై మెమో రైలులో గూడూరుకు బయలుదేరాడు. గూడూరు రైల్వే స్టేషన్‌కు మెమో రైలు రాగానే స్కూల్‌కి త్వరగా వెళ్లాలనే ఆత్రుతలో ప్లాట్‌ఫారంపై దిగేందుకు ప్రయత్నించాడు. దీంతో తాను ప్రయాణిస్తున్న రైలు కిందనే పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న సహచర ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. ఎంఈఓ–2 కాంచన, ఉపాధ్యాయులు పోస్టుమార్టం అయ్యే వరకు ఆస్పత్రి వద్దే ఉండి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆపై వారిని ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు.



